
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 5 సెప్టెంబరు 2024




కొడిమ్యాల మండలం పోతారంలో మత్తడిపారుతున్న చెరువు

- జిల్లాలో మొత్తం చెరువులు 1,072
- మత్తడి పారుతున్నవి 796
- సగానికిపైగా నిండిన చెరువులు 95
- స్వల్పంగా దెబ్బతిన్న ఐదు చెరువులు
- సాగునీటికి తీరిన కొరత


మత్తడి దూకుతున్న కథలాపూర్ మండలం బొమ్మెన ప్రాజెక్టు

చెరువులకు జలసిరి

జగిత్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరద నీటితో చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. వందల సంఖ్యలో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ అధిక వర్షపాతం నమోదై వరద పోటెత్తడంతో చెరువులు, కుంటలు, ఇతరత్రా జలాశయాలు పూర్తిస్థాయిలో నిండి మత్తడి మీద నుంచి పారుతున్నాయి. జిల్లాకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుతో పాటు వరద కాలువ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, రోళ్లవాగు ప్రాజెక్టు, బొమ్మెన ప్రాజెక్టు, రాళ్లవాగు ప్రాజెక్టు, సుమారు 35 ఎత్తిపోతల పథకాలు, పలు రిజర్వాయర్లలో, చిన్నాచితక ప్రాజెక్టులలో జలకళ ఉట్టిపడుతోంది. దీంతో జిల్లాలోని ఆయకట్టు రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

60 వేల ఎకరాల ఆయకట్టు..

జిల్లా వ్యాప్తంగా 1,072 చెరువులు, కుంటలున్నాయి. వీటి కింద సుమారు 60 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో వంద ఎకరాలకు పైబడి ఆయకట్టు కలిగిన చెరువులు 166 కాగా, వంద ఎకరాల్లోపు ఆయకట్టు గల చెరువులు 906 ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల జిల్లాలోని 796 చెరువులు మత్తడి పారుతున్నాయి. 181 చెరువులు పూర్తిగా నీటితో నిండుకుండలా మారాయి. 95 చెరువులు సగానికిపైగా నిండాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల జిల్లాలోని పలుప్రాంతాల్లో ఐదు చెరువులు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఇందులో మూడు చెరువుల మరమ్మతులను అధికారులు పూర్తి చేశారు. మరో రెండు చెరువుల మరమ్మతు పనులు చేయడంపై దృష్టి సారించారు. జిల్లా పరిధిలోని 14 మండలాల్లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువ కింద ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 1,67,744 ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారు.

అన్నదాత ఆనందం..

జగిత్యాల జిల్లాలోని పలు చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి గత నెలలోనే నీరు చేరినా... అంతంతమాత్రంగానే నిండాయి. దీంతో ఆయకట్టు కింద రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కురి సిన భారీ వర్షాలతో చెరువుల్లోకి నిండుగా నీరు చేరడంతో జలకళను సంతరించుకున్నాయి. ఆయకట్టుకు నీటి కొరత తీరడంతో పాటు మూగ జీవాల దాహార్తి సైతం తీరనుంది. పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగనున్నాయి. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇరు శాఖల సంయుక్త పర్యవేక్షణ...

ప్రస్తుత యేడాది వరద కారణంగా జిల్లా వ్యాప్తంగా ఐదు చెరువులకు బుంగలు, గండ్లు పడ్డట్లు అధికారులు గుర్తించారు. నీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారులు సంబంధిత చెరువుల మరమ్మతు పనులు చేపట్టారు. పలు చెరువులకు పనులను చేపట్టడానికి ప్రణాళిక రూపొందించారు. వరదలతో నిండిన చెరువులకు గండ్లు పడకుండా రెవెన్యూ, చిన్న నీటిపారుదల శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. చెరువులు, కుంటల స్థితిగతులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తూ రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం నివేదించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అధిక వర్షపాతం నమోదు...

ప్రస్తుత సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా అధిక వర్షపాతం నమోదైంది. మూడు మండలాల్లో మినహా ఇతర ప్రాంతాల్లో అదనపు, అధిక అదనపు వర్షపాతం నమోదు అయింది. జిల్లావ్యాప్తంగా సాధారణ కంటే 37.0 శాతం వర్షం అధికంగా కురిసింది. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 701.1 మిల్లీమీటర్లు కాగా 958.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని పెగడపల్లి, మల్యాల, కొడిమ్యాల, మేడిపల్లి, రాయికల్, మల్లాపూర్ మండలాల్లో అధిక వర్షపాతం కురిసింది.

అదేవిధంగా సారంగాపూర్, ఇబ్రహీంపట్నం, జగిత్యాల రూరల్, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, ఎండపల్లి, బీమారం మండలాల్లో అధిక వర్షాపాతం నమోదైంది. జిల్లాలోని గొల్లపల్లి, వెల్గటూరు, బుగ్గారం, ధర్మపురి, బీర్‌పూర్ మండలాల్లో సాధారణ వర్షాపాతం కురిసినట్లుగా రికార్డులు తెలుపుతున్నాయి. జిల్లాలో అత్యధికంగా కొడిమ్యాల, మల్లాపూర్‌లో 73.0 శాతం, అత్యల్పంగా బుగ్గారం 3.0 శాతం, గొల్లపల్లిలో 6.0 శాతం వర్షం కురిసింది.




మత్తడి దూకుతున్న వర్షకొండ చెరువు, మేడిపల్లిలో మత్తెడిపై నుంచి ప్రవహిస్తున్న నీరు, బీమారంలో దెబ్బతిన్న చెరువును పరిశీలిస్తున్న అధికారులు

వెల్గటూర్ మండలంలో భారీ వర్షం

- ముత్తునూర్‌లో ఇళ్లలోకి చేరిన నీరు
- నీట మునిగిన పైడిపల్లి-గొడిశెలపేట బ్రిడ్జి


పైడిపల్లి-గొడిశెలపేట రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు

వెల్గటూర్, సెప్టెంబరు 4: వెల్గటూర్ మండలలో బుధవారం వాన దంచి కొట్టింది. ఉదయం నుంచి కుండపోతగా వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగి పోర్లాయి. పైడిపల్లి-గొడిశెలపేట మధ్య గల వాగు ఉప్పొంగింది. వాగులో వరద తీవ్రత పెరగడంతో బ్రిడ్జి పైనుంచి నీరు ప్రవహించింది. రోడ్డు పైనుంచి నీరు ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాగు పక్కన లోతట్టు ప్రాంతంలో గల ఇళ్లలోకి నీరు చేరింది. ముత్తునూర్‌లో వాగులోకి నీరు చేరడంతో లోతట్టు ప్రాంతంలో గల ఇళ్లలోకి నీరు చేరింది. దీనితో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలోకి నీరు చేరడంతో సామగ్రి, బియ్యం పూర్తిగా తడిచిపోయాయి. వాటిని కాపాడుకోవడానికి నానా అవస్థలు పడ్డారు. కొన్ని చోట్ల పంట నీట మునిగింది. పత్తి పంట లోకి నీరు చేరింది. దీనితో రైతులు ఆందోళన చెందుతున్నారు.


పత్తి చేలలోకి చేరిన వర్షం నీరు

కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లపై డీఆర్‌డీవో ఆగ్రహం

- 85 వేల 781 రూపాయల రికవరీకి ఆదేశాలు

బీర్‌పూర్, సెప్టెంబరు 4: కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఒక్కరు కూడా బాధ్యతగా పనులు చేయలేదని అడిషనల్ డీఆర్‌డీవో మధన్‌మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మండల మూడో విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని బుధవారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో లచ్చాలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాదిహామీ పథకం ద్వారా బీర్‌పూర్ మండలంలోని పంచాయతీల్లో జరిగిన పనుల్లో జరిగిన అవకతవకలపై చర్చించారు. 15 గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు 8,724 రూపాయలు, పంచాయతీ కార్యదర్శులు 36,492 రూపాయలు, టెక్నికల్ అసిస్టెంట్లు 21,085 రూపాయలు, కంప్యూటర్ ఆపరేటర్లు 180 రూపాయలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు 17,850 రూపాయలు, ఏపీవోలు 1,450 రూపాయలు మొత్తం 85,781 రూపాయలను తిరిగి చెల్లించాల్సిందిగా ఆదేశించారు. ఇందులో రికార్డులు సరైన విధంగా రాయకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం కింద 15 గ్రామ పంచాయతీలకు 12,000 రూపాయలు జరిమానా విధించారు. విదేశాల్లో ఉన్నవారికి కూలీలు కట్టించడం, కొలతల్లో తేడాలు రావడం, రెండు జాబ్ కార్డులు ఉన్నవారికి కూలీలు చెల్లించడం లాంటి పొరపాట్లను గుర్తించి 73,781 రూపాయలను రికవరీ కింద గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీవీవో చిన్నయ్య, అడిషనల్ డీవీవో దేవేందర్, అంబుడ్స్‌మెన్ క్రిష్ణారెడ్డి, క్యూసీ ప్రసాద్, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, స్టేట్ రిసోర్స్ పర్సన్ పాండురంగా, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల బలోపేతానికి కృషి: ఎమ్మెల్యే


ఉద్యోగార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 4: గ్రామపంచాయతీల్లో లైబ్రరీ సెస్ వసూలు చేసే విధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, లైబ్రరీల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని లైబ్రరీని సందర్శించి, పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న నిరుద్యోగ యువతతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంతో పాటు, జిల్లా దూరప్రాంతాల నుంచి అనేక మంది లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తానన్నారు. లైబ్రరీలో కరెంటు, స్టేషనరీ సమస్య తన దృష్టికి వచ్చిందని పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. రూ.కోటితో నిర్మిస్తున్న లైబ్రరీ భవనాన్ని త్వరగా పూర్తిచేసి, జిల్లా గ్రంథాలయాన్ని సొంత భవనంలోకి మార్చేందుకు చొరవ తీసుకుంటానన్నారు. జిల్లా కేంద్రంలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే విధంగా స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఫోన్ ద్వారా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలియజేశారు. ఆయన వెంట లైబ్రేరియన్ శకుంతల, మాజీ డైరెక్టర్ సుధాకర్, కౌన్సిలర్‌లు అనిల్, నారాయణరెడ్డి, నాయకులు గిరి, అరిఫ్, మనోహర్, శశి, రామకృష్ణ, రమేష్ తదితరులు ఉన్నారు.

భవిష్యత్‌లో ఇబ్బందులు కలగకుండా నిర్మాణాలు

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


లింగాపూర్ చెరువును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, సెప్టెంబరు 4: ప్రకృతి విపత్తులు సంభవించినపుడు భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ నిర్మాణాలు చేపడతామని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని లింగాపూర్ పెద్ద చెరువుకు మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్ద ఎత్తును వరద నీరు వచ్చి చేరుతుండగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అధికారులు, స్థానిక నాయకులతో కలసి బుధవారం సందర్శించి పరిశీలించారు. అనంతరం శాలపల్లి అడుపపల్లి గ్రామాల మధ్యన లోలెవల్ బ్రిడ్జి పైనుంచి ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నీటి ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి చెరువు కట్ట మరమ్మతు, హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అకాల వర్షాలతో లింగాపూర్, శాలపల్లి గ్రామాల ప్రజలతో పాటు మండల ప్రజలు రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. భవిష్యత్‌లో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా బ్రిడ్జిలు, కల్వర్టులు, చెరువు కట్టలు, తూముల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. లింగాపూర్ చెరువుతో పాటు మండలంలోని చెరువుల కట్టలు, తూములు, మత్తడి నిర్మాణాలు చేసి సాగు నీరు వృదా కాకుండా రైతాంగానికి ఉపయోగపడేలా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, గిర్దావర్ శ్రీనివాస్, పార్టీ నాయకులు రాములుగౌడ్, ఒరుగల శ్రీనివాస్, పూసాల శోభాతిరుపతి, కురిక్యాల శేఖర్, రాంచంద్రం, విజయభాస్కర్, మహేందర్ పాల్గొన్నారు.

94 ఎకరాల్లో వరి పంట నష్టం

కొడిమ్యాల, సెప్టెంబరు 4 : గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో మండలంలోని సూరంపేట, గంగరాంతండా, కోనాపూర్, నాచుపల్లి గ్రామాల్లో 94 ఎకరాలలో వరి పంట నష్టానికి గురైనట్లు సంబంధిత అధికారులు అంచనా వేశారు. సుమారు రెండేళ్ళ క్రితం తెగిపోయిన పోతు చెరువు నుండి నీరు నేరుగా రావటంతో సూరంపేట, గంగారాంతండాకు చెందిన వరి పొలాల్లో నీరు చేరినట్లు, ఏవో పి జ్యోతి తెలిపారు. కొందరి రైతుల పొలాల్లో ఇసుకమేటలు పెట్టినట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఏవో తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 4: జగిత్యాల ప్రాజెక్ట్ పరిధిలోని రూరల్ మండలం అంతర్గాం అంగన్‌వాడీ కేంద్రంలో రూరల్ మండల సూపర్‌వైజర్ లావణ్య పోషకాహారం పై తల్లులకు అవగాహన కల్పించారు. పోషణమాస సందర్భంగా సెప్టెంబర్ 1 నుండి 30 వ తేదీ వరకు నిర్వహించబడే కార్యక్రమాల్లో బాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. ఏక్‌పేడ్ మాకేనామ్‌లో భాగంగా అంగన్‌వాడీ కేంద్ర ఆవరణలో మునగ, కరివేపాకు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహిపాల్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు సరళ రాణి, దయావతి, చిన్నారులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల సెక్టార్ పరిధిలోని దావన్‌పెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాస వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలోని పిల్లలకు పౌష్టికాహారం, పెరుగుదల, తక్కువ బరువు ఉన్న పిల్లలపై ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వీణ రాణి, అంగన్‌వాడీ టీచర్ రోజా తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

- మండపాల వద్ద శానిటేషన్ తప్పనిసరిగా చేయించాలి
- కలెక్టర్ బి సత్యప్రసాద్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జగిత్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. బుధవారం గణేష్ ఉత్సవాల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రజలంతా ఐక్యమత్యంతో చేసుకోవాలని కోరారు. పోలీస్‌శాఖ నిబంధన మేరకు రెండు సౌండ్‌బాక్స్‌లు మాత్రమే పెట్టుకోవాలన్నారు. నిర్వాహకులు ఏ రోజు నిమజ్జనం చేస్తారో పోలీస్‌శాఖవారికి ముందస్తుగా తెలియపరచాలన్నారు. ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం పూర్తయ్యేవరకు ఆయా శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా లోని అన్ని మండపాల నిర్వాహకులు తమ గణపతుల సమగ్ర సమాచారాన్ని పోలీస్‌వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. విగ్రహాలను నిర్ణీత సమయానికి నిమజ్జనం చేసేలా అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్‌రెడ్డి, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, డీపీవో రఘువరణ్, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పూజించాలి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను పూజించాల్సిన అవసరముందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల తన చాంబర్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లను వివిధ విభాగాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడారు. సాంప్రదాయబద్ధంగా గణేష్ చవితిని జరుపుకోవాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను కాకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించాలని తెలిపారు. కాలుష్యనియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వేల మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ ఏవో హన్మంత్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ సహాయక శాస్త్రవేత్త కనక జ్యోతి, జిల్లా సంక్షేమ అధికారి నరేశ్, కలెక్టరేట్ కార్యాలయ పలువురు సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

మల్లాపూర్ ఎంపీడీవోగా జగదీష్

మల్లాపూర్, సెప్టెంబరు, 4: మండల ప్రజాపరిషత్ అధికారిగా జగదీష్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మల్లాపూర్ ఎంపీడీవో విధులు నిర్వహించిన రాజేందర్‌రెడ్డి ఇటీవల పదవీ విరమణ పొందారు. దీంతో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీవోగా పనిచేస్తున్న జగదీష్‌కు ఎంపీడీవో స్థానం కల్పించి బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆయన ఎంపీడీవో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని కార్యదర్శులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

గంగామాత ఆలయంలో వేలంపాట

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 4: మండలంలోని ఎర్దండి గ్రామ శివారులోని గోదావరి ఒడ్డున ఉన్న మల్లికార్జున గంగామాత ఆలయ ఆవరణలో ఈ నెల 6న వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో విక్రమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో కొబ్బరికాయలు, కిరణ సామగ్రి, లడ్డు, పులిహోర అమ్మేందుకు 5 వేల రూపాయలు డిపాజిట్, ఐస్‌క్రీం అమ్ముటకు 10 వేల రూపాయల డిపాజిట్ చెల్లించి శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం

మున్సిపల్ కమిషనర్ మిర్జా ఫసహత్ ఆలీ బేగ్



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 4: సిరిసిల్ల పట్టణ పరిధి వార్డులలోని ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు మొలచి దోమలు పెరుగుతున్నాయని ఫిర్యాదు లు వస్తున్నాయని, ఆ ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ మిర్జా ఫసహత్ ఆలీ బేగ్ అన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొత్త చెరువు నుంచి వరద ప్రవాహంతో కలిగిన సమస్యలపై దృష్టి సారించిన మున్సిపల్ అధికారులు బుధవారం సిరిసిల్ల పట్టణం శాంతినగర్, శ్రీనగర్ కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొత్త చెరువు వరద ప్రవాహంతో కాలనీ వాసులకు కొంత ఇబ్బంది కలగడం వాస్తవమైనా కొత్త చెరువు నీటిని ఒకే సారి వదలకుండా కొద్ది కొద్దిగా వదులుతున్నట్లు చెప్పారు. శాంతినగర్, శ్రీనగర్‌కాలనీలో నీటి నిల్వలు ఉన్నట్లుగా గుర్తించి జేసీబీ సహాయంతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నవాటిని తొలగించామన్నారు. డ్రైనేజీలలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు స్ప్రేయింగ్, బ్లీచింగ్ పౌడర్ వేస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీలు, చెట్ల పొదలను తొలగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుధ్య విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లిప్‌కార్ట్‌లో ఉద్యోగం పేరిట రూ.6.98 లక్షల టోకరా

జమ్మికుంట, సెప్టెంబరు 4: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటకు చెందిన వి శృతికి స్నాప్‌చాట్ ద్వారా పరిచయమైన గుర్తు తెలియని వ్యక్తి ఫ్లిప్‌కార్ట్‌లో ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికి పలు మార్లు లక్షల రూపాయలు కాజేశాడు. ఫ్లిప్‌కార్ట్‌లోని వస్తువులకు మెసెజ్, లైక్ చేస్తే డబ్బులు వస్తాయని, అందుకు ముందుగా కొంత పెట్టుబడి పెట్టాలని నమ్మించాడు. గత నెల 27నుంచి ఈ నెల 3వ తేదీ వరకు పలు విడుతల్లో రూ.6.98లక్షలు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పంపించారు. తర్వాత ఫోన్ చేస్తే అవతలి వ్యక్తి నుంచి స్పందన కరువైంది. బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 4: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను కరీంనగర్ మూడో ఠాణా పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మానేరు వాగు నుంచి ఇసుకలోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్‌ను హౌసింగ్‌బోర్డు కాలనీ బైపాస్‌రోడ్‌లో పట్టుకుని ఠాణాకు తరలించి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పెద్దాపూర్ గురుకులానికి తిరిగి వస్తున్న విద్యార్థులు



గురుకుల పాఠశాలకు తిరిగి వచ్చిన విద్యార్థులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 4: మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు ఇరువై రోజుల తరువాత విద్యార్థులు తిరిగి వస్తున్నారు. బుధవారం తిరిగి పునః ప్రారంభించిన గురుకులానికి ఇంటర్, పదో తరగతి విద్యార్థులు తరలి వచ్చారు. గురుకుల పాఠశాలలో వరుసగా జరిగిన సంఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. పాఠశాలకు రావడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. గురుకులంలోని పాఠశాలలో 410 మంది, కళాశాలలో 130 మంది మొత్తం 540 విద్యార్థులు చదువుకుంటున్నారు. గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మృతిచెందగా మరో నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. తరువాత విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులు క్లాసలను నిర్వహించారు.

పాఠశాలలో జరిగిన సంఘటనలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందర్శించారు. గురుకులం అభివృద్ధికి కట్టుబడి ఉందని తక్షణమే రూ. 50లక్షలను నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాఠశాలలోని విద్యార్థులకు కావల్సిన వసతులు కల్పించడానికి సెలవులు ప్రకటించారు. అసంపూర్తిగా ఉన్న నూతన భవనంలోకి విద్యార్థులకు కావల్సిన డబుల్ కాట్ బెడ్స్, మౌలిక వసుతులు, కావల్సిన మరమ్మతులను చేయించారు. ఉన్నత అధికారుల సూచనల మేరకు పదో తరగతి, ఇంటర్‌మీడియట్ కళాశాల విద్యార్థుల భవిష్యత్ కోసం నేరుగా పాఠాలను నేర్పడానికి బుధవారం నుంచి గురుకుల పాఠశాల తరగతులను పునఃప్రారంభించారు. మరో వారంలోగా పూర్తిస్థాయిలో అన్ని తరగతులను ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. గురుకులంలో విద్యార్థులకు కావాల్సిన వసతుల తరువాత ఉపాధ్యాయుల సూచనల మేరకు విద్యార్థులు తిరిగి పాఠశాలకు వస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఎస్సీ గురుకుల కార్యదర్శిని తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్వేరోస్ ప్రతినిధులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 4: ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిని వెంటనే తొలగించాలని స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మాతంగి మారుతి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. బ్రహ్మకుమారి అనే ఆధ్యాత్మిక సంస్థ ద్వారా విద్యార్థులకు మానసిక తరగతులను నిర్వహించేందుకు ఒప్పందం చేసుకున్నారని, దానిని రద్దు చేసి సీనియర్ సైకాలజిస్టులచేత తరగతులను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించిన ఉపాధ్యాయులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, స్పోర్ట్స్ అకాడమిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో పిల్లలకు హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, గురుకులాలకు పక్కాభవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గోష్కి కుమార్, ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి రజిత, జాయింట్ సెక్రెటరీ కవ్వంపెల్లి విఘ్నేష్ పాల్గొన్నారు.

కొచ్చెరువు మత్తడి ధ్వంసం

వృథాగా పోతున్న నీరు



గంభీర్‌పూర్‌లో ధ్వంసమైన కొచ్చెరువు మత్తడి

కథలాపూర్, సెప్టెంబరు 4: మండలంలోని కొచ్చెరువు మత్తడి ధ్వంసం కావడంతో బుధవారం చెరువు నుంచి నీరు వృథాగా పోతోంది. గతంలోనే మత్తడి ధ్వంసం కాగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పైభాగంలో ఉన్న అడవుల్లోంచి పుష్కలంగా నీరు వస్తుండంతో వరద ప్రవాహం పెరిగింది. దీంతో గతానికి మించి మరికొంత మత్తడి ధ్వంసం కావడంతో నీరు కిందికి వృథాగా పోతోంది. మత్తడి మరమ్మతులకు నిధులు మంజూరైనప్పటికీ వర్షాకాలం ప్రారంభం కావడంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	2,75,692	3,55,524	80.5	70.425
ఎల్లంపల్లి	3,39,782	2,40,262	20.175	13.667
మిడ్ మానేరు	19,017	9,850	27.54	21.766
ఎల్ఎండీ	20,840	283	24.034	18.589
ఎగువమానేరు	27,500	------	2.00	2.00

నిండుకుండల్లా ప్రాజెక్టులు

● ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల
● 18 టీఎంసీలు దాటిన ఎల్ఎండీ


జగిత్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2,75,692 క్యూసెక్కుల నీరు వస్తుంటే...41 గేట్లు పైకి ఎత్తి దిగువకు 3,55,524 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 19 వేల క్యూసెక్కులు వరద కాలువకు, నాలుగు వేల క్యూసెక్కులు కాకతీయ కాలువకు, నాలుగు వేల క్యూసెక్కులు ఎస్కేప్ గేట్ల ద్వారా విద్యుత్ తయారీకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు... ప్రస్తుతం 70.425 టీఎంసీల నీరు ఉంది. మహారాష్ట్రలోని నాసిక్, నాందేడ్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో శ్రీరాంసాగర్‌లోకి ఇన్‌ఫ్లో ఎక్కువగా వస్తోంది. గోదావరి నదిపై ఉన్న విష్ణుపురి ప్రాజెక్టు నిండింది. బాలేగావ్ ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తడంతో పాటు దాదాపు 1.8 లక్షల క్యూసెక్కుల మేర వరద దిగువకు వస్తోంది. కామారెడ్డి జిల్లాలోని మంజీర, నిజామాబాద్ జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతం, నిర్మల్ జిల్లాలోని గడ్డెన్న వాగు నుంచి మరో 80 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది.

● శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

పెద్దపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి)/అంతర్గాం: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. బుధవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 3,39,782 క్యూసెక్కుల వరద నీరు ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్నది. దిగువకు 22 గేట్ల ద్వారా 2,40,262 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.667 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

● మిడ్ మానేరు ప్రాజెక్టు..

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షాలకు మానేరు, మూల వాగు ఎస్సారెస్పీ నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 19,017 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇందులో మానేరు, మూలవాగు ద్వారా 2,405 ఎస్సారెస్పీ నుంచి 10,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, ఎల్ఎండి ప్రాజెక్టుకు రెండు గేట్ల ద్వారా 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 21.766 టీఎంసీల మేరకు ఉంది.



దిగువకు దూకుతున్న శ్రీరాంసాగర్ నీరు



ఎల్ఎండీలో నీరు

● నిండుతున్న ఎల్ఎండీ

తిమ్మాపూర్: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోని భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ ఇన్‌ఫ్లోతో ఎల్ఎండీ పూర్తి స్థాయిలో నిండే అవకాశం ఉంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో కుంటలు, చెరువులు అన్ని నిండి మత్తడి దూకుతున్న నీరు మోయతుమ్మెద వాగులోకి వచ్చి చేరుతోంది. శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ నుంచి ఇరిగేషన్ అధికారులు ఎల్ఎండీలోకి బుధవారం నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం మోయతుమ్మెద వాగు నుంచి 33,856 క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 3,300 క్యూసెక్కులు, ఎగువ ప్రాంత్రం నుంచి 1,831 క్యూసెక్కులు, మొత్తం 25,285 క్యూసెక్కుల నీరు ఎల్ఎండిలోకి వచ్చి చేరుతోంది. ఔట్‌ఫ్లో 287 క్యూసెక్కులు ఉంది. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలకు ప్రస్తుతం 18.074 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 22 టీఎంసీలకు చేరుకుంటే ఎల్ఎండీ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

పరివాహక ప్రాంతాలకు హెచ్చరిక

లోయర్ మానేరు డ్యామ్ ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. పోలీసు శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు.నదీ పరివాహక ప్రాంతంలోకి పశువులు, గొర్రెలు వెళ్లకుండా, చేపలు పట్టేవారు, గొర్రెల కాపరులు, రైతులు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. దిగువ పరివాహక ప్రాంతాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

నవ వధువు ఆత్మహత్య

● వివాహం అయిన 18 రోజులకే ఘటన
● ఈ లోకంలో ఉండడం ఇష్టం లేకే అని చేతిపై రాత



భాగ్యలక్ష్మి (ఫైల్)

మల్యాల, సెప్టెంబరు 4: పెళ్లి అయిన నెల రోజులు కూడా గడవక ముందే ఓ నవవధువు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన కనుక భాగ్యలక్ష్మి (25)కి పక్క గ్రామం మ్యాడంపల్లికి చెందిన తడగొండ ఉదయ్‌కిరణ్‌తో గత నెల 18న వివాహం జరిగింది. ఉదయ్‌కిరణ్ హైదరాబాద్ లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండడంతో వివాహం అనంతరం హైదరాబాద్ వెళ్లారు. భాగ్యలక్ష్మిని తల్లిదండ్రులు మంగళవారం తక్కళ్లపల్లికి తీసుకువచ్చారు. బుధవారం భాగ్యలక్ష్మి తల్లిదండ్రులు పనుల నిమిత్తం మల్యాల వెళ్లారు. దీంతో ఇంట్లో భాగ్యలక్ష్మి ఒక్కరే ఉండగా మధ్యాహ్నం వచ్చిన వాళ్ల తల్లి బాత్‌రూంకు వెళ్లేసరికి బాత్ రూంలో చున్నీతో ఉరివేసుకొని కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై నరేశ్‌కుమార్ సంఘట స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా మృతురాలి చేతిపై 'తాను ఎవరి కారణం వల్ల చనిపోవడం లేదని, నన్ను ఎవరూ ఏమీ అనలేదని, నాకే ఈ లోకంలో ఉండడం ఇష్టం లేదని అందుకే వెళ్లిపోతున్నా.. అని రాసి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పవర్‌లూం క్లస్టర్‌తో నేత కార్మికులకు ప్రయోజనం

● యారన్ సబ్సిడీ 80 శాతానికి పెంచాలి ● నేత కార్మికులకు పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలి
● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ● కేంద్ర చేనేత జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు వినతి

సిరిసిల్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో మెగా పవర్‌లూం క్లస్టర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా వేలాది మంది నేత కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గిరిరాజ్‌సింగ్‌ను సన్మానించారు. సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ మంజూరు చేయాలని, యారన్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. యారన్ సబ్సిడీని 80 శాతానికి పెంచాలని, పావలా వడ్డీకి రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పవర్‌లూం క్లస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా యంత్రాల ఆధునీకీకరణతో పాటు ఉత్పాదకతను కార్మికుల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వం పెంచుతుందని పేర్కొన్నారు. నాణ్యమైన వస్త్రాలను అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. యారన్ డిపోతో ముడిసరుకులు సులభంగా, తక్కువ ధరకు లభిస్తాయని వివరించారు. యారన్ సబ్సిడీని 80 శాతానికి పెంచడంతోపాటు పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలని కోరారు. టెక్స్‌టైల్ శాఖ మంత్రి పవర్‌లూం క్లస్టర్ యారన్ డిపో మంజూరుపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ రుణాలపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారని వివరించారు.



కేంద్ర చేనేత జౌళిశాఖ మంత్రిని సన్మానిస్తున్న బండి సంజయ్

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 4: మద్యం తాగి వాహనం నడిపిన రంగాపూర్‌కు చెందిన వేములవాడ మహేష్ అనే యువకుడికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ బుధవారం జగిత్యాల న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. మద్యం తాగి మహేష్ వాహనం నడపడంతో ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం కేసు నమోదు చేసి సంబంధిత కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనదారుల అజాగ్రత్త చర్యల వల్ల అవతలి వ్యక్తులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారకు. వారి కుటుంబాలు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం వాహనదారులకు సూచించారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

దొంగతనం కేసుల్లో ముగ్గురికి జైలు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 4: జిల్లాలోని వివిధ చోట్ల దొంగతనం చేసిన కామారెడ్డి జిల్లా బతుకమ్మకుంటకు చెందిన వెంకల్‌వాడ మారుతి, ఇందిరానగర్‌కు చెందిన మండల సాయికుమార్‌లకు ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధిస్తూ ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు ఇచ్చారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వీరిద్దరు దొంగలు ఫిబ్రవరి 19, 2023న సిరిసిల్ల పట్టణంలోని మల్లికార్జున వైన్స్‌లో , కార్తికేయ వైన్స్‌లలో చోరీకి పాల్పడ్డారని, మార్చి 13, 2023న సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో గల దత్తునాయక్ ఇంటి ఎదుట పార్క్‌చేసిన ద్విచక్రవాహనం , అదే రోజు ప్రశాంత్‌కు ఇంట్లో చోరీకి పాల్పడ్డారని ఆయన తెలిపారు. ఈకేసుల్లో సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసి ఇద్దరిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపామని ఆయన తెలిపారు. విచారణ అనంతరం కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా కోర్టు కానిస్టేబుల్ నరేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున సందీప్ వాదనలు వినిపించగా కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరస్థులకు ఒక ఏడాది కఠినకారాగార శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధించారని ఆయన తెలిపారు.

ఇదేవిధంగా మరో వాహన చోరీ కేసులో గంభీరావుపేటకు చెందిన అంకం రాజు అనే వ్యక్తికి ఏడునెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని ఆయన తెలిపారు. సమాజంలో నేరం చేసిన వారెవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని, శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని తెలిపారు. అయిదు కేసులలో శిక్షలు పడడంలో కృషిచేసిన పిపి సందీప్, సిఎంఎస్ ఎస్ఐ రవీంద్రనాయకుడు, కోర్టు కానిస్టేబుల్ నరేశ్‌ను ఎస్పీ అభినందించారు.

నిప్పు అంటించుకొని ఒకరి ఆత్మహత్య

తిమ్మాపూర్, సెప్టెంబరు4: మండలంలోని ఇందిరానగర్ గ్రామ శివారులో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్‌పోసుకొని నిప్పు అంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్ఎండి ఎస్సై వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్న సత్తు రఘు(48) కరీంనగర్‌లోని శ్వేత హోటల్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఇంటి నుండి బయలుదేరి ఇందిరానగర్ గ్రామ శివారులో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు, పూర్తి వివరాలు తెలియల్సిఉందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివేక్ తెలిపారు.

మల్యాలలో రేషన్ దుకాణాల తనిఖీ

మల్యాల, సెప్టెంబరు 4: రేషన్‌బియ్యాన్ని ప్లాస్టిక్ బియ్యంగా అపోహపడవద్దని, రేషన్‌బియ్యంలోనే అనేక పోషక పదార్థాలు ఉంటాయని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారి కృష్ణ అన్నారు. మల్యాలలోని పలు రేషన్ దుకాణాలను నాణ్యత ప్రమాణాల అధికారి రసీద్ ఇతర అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో బియ్యం నాణ్యత పరిశీలించారు. రేషన్ లబ్ధిదారులతో మాట్లాడారు. నాయబ్ తహసీల్దార్ బి శ్రీనివాస్, బీఎస్ స్వామి, వంశీ తదితరులు ఉన్నారు.

మద్దులపల్లిలో జాలరి అదృశ్యం



బాబు (ఫైల్)

పెగడపల్లి, సెప్టెంబరు 4: పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గన్నెబోయిన బాబు (52) అనే జాలరి మంగళవారం సాయంత్రం నుంచి అదృశ్యమయినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. ఎస్ఐ రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాబు మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు గ్రామ శివారులోని చెరువు మత్తడి వద్దకు చేపలు పట్టేందుకని వెళ్లాడని, తిరిగి ఇంటికి రాలేదన్నారు. బాబు భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 4: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,550 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు 15క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,550 చొప్పున పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

మల్యాల, సెప్టెంబరు 4: మండలంలోని బల్వంతాపూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులపై నమోదు అయిన ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ రఘుచందర్ బుధవారం విచారణ జరిపారు. బల్వంతాపూర్‌కు చెందిన రమేష్, సురేశ్ అనే వ్యక్తులపై ఇదే గ్రామానికి చెందిన తొడేటి బాబు అనే వ్యక్తి కారు డబ్బుల విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మూడురోజుల క్రితం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కాగా డీఎస్పీ బల్వంతాపూర్‌లో విచారణ జరిపారు. డీఎస్పీ వెంట ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.

జ్వరంతో బాలుడి మృతి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 4: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మూడేళ్ల బాలుడు హర్షిత్ విష జ్వరంతో మృతి చెందాడు. ఎల్లారెడ్డిపేటలోని తుడుం రవళి-అజయ్ దంపతుల కుమారుడు హర్షిత్‌కు నాలుగు రోజుల కిందట జ్వరం రావడంతో సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.. పరిస్థితి విషమంగా మారడంతో అదేరోజు వైద్యుల సూచనల మేరకు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి బాలుడు మృతి చెందాడు. సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో వెంటిలేటర్ సౌకర్యం లేకపోవడం వల్ల తమ కొడుకుకు మెరుగైన వైద్యం అందకుండాపోయిందని తల్లిదండ్రులు ఆరోపించారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు పర్శరాములు, నర్సింలు, బాలరాజుయాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ప్రకృతి వైపరీత్యాలను జాతీయ విపత్తుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 4: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరదలు, ప్రకృతి వైపరీత్యాలతో జరిగిన నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో రాష్ట్రమంతటా వరద ఉధృతితో అతలాకుతలం అయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహచర మంత్రులు, సభ్యులు నష్టాన్ని పరిశీలించారన్నారు. గత ప్రభుత్వం ఏనాడూ ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన ప్రజలను, మత్స్యకారులను ఆదుకున్నది లేదన్నారు. బీర్‌పూర్ మండలం రోళ్లవాగు వరదతో పంటపొలాల్లో ఇసుక మేటలు వేసి కోట్ల రూపాయలు పంట నష్టం వాటిల్లితే, పైసా నష్టపరిహారం గత ప్రభుత్వం నుంచి అందలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాయమందిస్తే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారనేది ప్రతిపక్ష నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ప్రతిపక్షం అంటే విమర్శలు చేయడం కాదనే విషయాన్ని గుర్తెరుగాలన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా పర్యటించకపోవడం, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం ఎక్స్ వేదికగా విమర్శలు చేయడం విచారకరం అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విదేశీ పర్యటన రద్దుచేసుకొని, సహాయక చర్యల్లో పాలుపంచుకోవాల్సింది పోయి, విమర్శలు చేయడం సరికాదని అదే వేదికగా సలహాలు, సూచనలు ఇవ్వాలని హితవుపలికారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మొత్తం వరదల ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు అహర్నిషలు కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో వరదల ప్రభావం 10వేల కోట్ల వరకు నష్టం ఉంటుందని, అందులో నుంచి కనీసం రూ.5వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంటు రూపంలో విడుదలకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చొరవచూపాలని కోరారు. రాష్ట్ర రాజధానిలో చెరువులు, నాళాలు అక్రమణకు అడ్డుకట్టవేసేందుకు తీసుకువచ్చిన హైడ్రాతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల్లో కూడా అమలుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించడం శుభపరిణామం అన్నారు. సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, మాజీ చైర్మెన్ గిరినాగభూషణం, ఫ్లోర్‌లీడర్ దుర్గయ్య, బ్లాక్ ప్రెసిడెంట్ పొలాస నందయ్య, మండలాధ్యక్షుడు జున్ను రాజేందర్, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, మాజీ ఎంపీపీలు మహేష్, ధర రమేష్, మాజీ వైస్ ఎంపీపీ గంగం మహేష్, మాజీ ఎంపీటీసీ రాధాకిషన్ రావు తదితరులున్నారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఎంపిక



ప్రమోదకుమార్



పద్మావతి

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 4: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాలలో తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ తత్వాది ప్రమోదకుమార్ ఈ ఏడాది ఉత్తమ రాష్ట్ర అధ్యాపక పురస్కారానికి ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ కలువకుంట రామకృష్ణ తెలిపారు. సెప్టెంబరు 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరబాద్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పురస్కారం అందుకోనున్నట్లు తెలిపారు. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలో జన్మించిన ప్రమోదకుమార్ పీహెచ్‌డీ పూర్తిచేసి, 1998 నుంచి అధ్యాపక వృత్తిలో కొన సాగుతున్నారన్నారు. ఓవైపు అధ్యాపక వృత్తిలో రాణిస్తూనే, మరోవైపు తెలుగు సాహిత్యంలో రచనలు చేస్తున్నారని, ప్రమోదకుమార్ అనువదించిన కన్నడ కథలు, చతుర, విపుల, వార్త, ఆంధ్రజ్యోతి, స్రవంతి మొదలైన వార పత్రికల్లో ప్రచురితం అయ్యిందన్నారు. రచనలతో పాటు సెమినార్‌లో పాల్గొని దాదాపు 30కిపైగా పత్ర సమర్పణలు చేశారన్నారు. 2013-14, 2014-15 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియేట్ తెలుగు పాఠ్యప్రణాళిక సంపాదకమండలి సభ్యుడిగా, కోర్స్ రైటర్‌గా పనిచేశారన్నారు. ప్రమోదకుమార్ ఉత్తమ అధ్యాపకుడిగా ఎన్నికవడంపై సహచర అధ్యాపకులు, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

గణేశ్‌నగర్ : రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారానికి శాతవాహన యూనివర్సిటీ సోషియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ పద్మావతి ఎంపికైనట్లు యూని వర్సిటీ అధికారులు తెలిపారు. గురువారం హైదరాబా ద్‌లోని రవీంద్ర భారతిలో ఆమె ఈ అవార్డును అందుకోనున్నారు.

కుక్కల దాడిలో బాలికకు గాయాలు

చిగురుమామిడి, సెప్టెంబరు 4: చిగురుమామిడి మండలంలోని నవాబ్‌పేటలో కక్కెర్ల శ్రీహన్సిని అనేక బాలికపై కుక్కలు దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. గ్రామంలోని పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో శ్రీహన్సిని కుక్కలు వెంబడించి గాయపరిచాయి. దాంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటని అధికారులు నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అవమానం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

● ఒకరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మల్యాల, సెప్టెంబరు 4: తమ గ్రామానికి చెందిన వ్యక్తి తనను చెంపపై కొట్టాడని అవమానం భరించలేక సూసైడ్ నోట్ రాసి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మ్యాడంపల్లిలో జరిగింది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మ్యాడంపల్లికి చెందిన తరాల లచ్చయ్య(48) అనే వ్యక్తి బుధవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలంలో మృతికి ముందు సుసైడ్ నోట్ రాసి పెట్టాడు. గ్రామానికి చెందిన గీకుడు నారాయణ అనే వ్యక్తి తన చెంపపై కొట్టాడని దీంతో తాను గ్రామంలో అవమానం భరించలేనని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. దీంతో నారాయణపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

లారీ బైక్ ఢీ .. ఒకరికి గాయాలు

సుల్తానాబాద్, సెప్టెంబర్ 4: సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన సుగ్లాంపల్లి సబ్‌స్టేషన్ వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సుగ్లాంపల్లి - నారాయణపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో ఓ యువకుడు బైక్‌పై వెలుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ లారీ కిందకు దూసుకుపోయింది, బైక్ నడుపుతున్న మంచిర్యాల జిల్లా తాల్లపల్లి సింగాపూర్‌కు చెందిన అన్నం సాయితేజ తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదం జరగడంతోనే లారీని వదిలి లారీ డ్రైవర్ పారిపోయాడు.

శిథిల ఆవాసాలలో.. సమస్యలతో సహవాసం

● వర్షం వస్తే సెలవులే ● తాటిపల్లి గురుకులంలో విద్యార్థుల ఇబ్బందులు



అసౌకర్యాల మధ్య విద్యార్థులు పడుకునే గది



తలుపులు లేని తరగతి గదులు

మల్యాల, సెప్టెంబరు 4: మల్యాల మండలంలోని తాటిపల్లి బాలికల గురుకులంలో పాఠశాల, ఇంటర్ విద్యార్థినులు శిథిల భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. సరైన వసతి, సౌకర్యాలు లేక అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. సౌకర్యాలు లేకపోవడంతో వర్షాలు కురిస్తే పాఠశాలకు సెలవులు ప్రకటిస్తున్నారు. విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయి. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల పట్టింపు లేని వైనంతో విద్యార్థులు ఏళ్లుగా అసౌకర్యానికి గురవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ స్కూల్ పరిధిలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గల తాటిపల్లి గురుకులానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. శిథిల భవనాలు, అసౌకర్యాలను పట్టించుకోకపోవడం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. విద్యార్థులు పడుకునే గదుల రేకులకు చిల్లులు పడి ఉన్నాయి. కొన్ని తరగతి గదుల్లోనూ అదే పరిస్థితి నెలకొనగా తలుపులు కూడా ఊడిపోతున్నాయి. శిథిల భవనాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో ఇటీవల కురిసిన వర్షాలకు సెలవులు ప్రకటించడాన్ని బట్టి ఇక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ధర్మపురి వద్ద కొనసాగుతున్న గోదావరి వరద



ధర్మపురి వద్ద నిండుగా ప్రవహిస్తున్న గోదావరి

ధర్మపురి, సెప్టెంబరు 4: ధర్మపురి వద్ద గోదావరి నది వరద బుధవారం సాయంత్రం వేగంగా కొనసాగింది. కొన్ని రోజుల నుంచి గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి పోయాయి. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరింది. సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రాజెక్టులోకి 13,092 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో ప్రాజెక్టు సంబంధించిన ఐదు గేట్లు తెరచి 28,635 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి అధికారులు విడుదల చేశారు. గోదావరి నీటి మట్టం పెరిగింది.

గురుకుల పార్ట్ టైం టీచర్లను విధుల్లోకి తీసుకోవాలి





కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న గురుకుల పార్ట్ టైం టీచర్లు, ప్రభుత్వ విప్ అడ్లూరికి వినతిపత్రాన్ని అందించిన పార్ట్ టైం, సీఆర్‌టీ ఉపాధ్యాయులు

జగిత్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పార్ట్ టైం పద్ధతిలో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న టీచర్లను ప్రభుత్వం అర్ధాంతరంగా తొలగించడాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం పలువురు గురుకుల పార్ట్ టైం టీచర్లు జగిత్యాల కలెక్టరేట్ కార్యాలయానికి తరలివచ్చారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు గురుకుల టీచర్లు జగిత్యాలకు వచ్చారు. కలెక్టరేట్ కార్యాలయంలో నిరసనను వ్యక్తం చేసి కార్యాలయ ఏవోకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. సుమారు పదిహేను సంవత్సరాలుగా గురుకుల పాఠశాలల్లో పార్ట్ టైం టీచర్లుగా పనిచేస్తున్న తమను రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఉన్నఫలంగా తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో పనిచేస్తున్న పార్ట్ టైం టీచర్లను అర్ధాంతరంగా తొలగించడం వల్ల తాము వీధిన పడే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. సంబంధిత నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవడంతో పాటు సీనియారిటీ లెక్కన మినిమమ్ టైం స్కేల్‌పై నియామకం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శంకర్, నాయకులు కిరణ్, సురేశ్, బాబు, సంతోష్ కుమార్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ విప్‌నకు వినతి

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం, సీఆర్‌టీ ఉపాధ్యాయులు కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా తమను తొలగించిన విషయమై క్యాంపు కార్యాలయంలో ఉన్న ప్రభుత్వ విప్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన స్పందించి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుక వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

'డబుల్' ఇళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 4: నిరుపేదల గూడు కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాన్ని ఎమ్మెల్యే అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. ఎమ్మెల్యే వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్‌కు సన్మానం

కొడిమ్యాల, సెప్టెంబరు 4: ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ ఎం. సంజీవ్‌ను మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అధ్యాపకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి(డీఐఈవో) డాక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగులు బదిలీ అయిపుటికీ వారు చేసిన సేవలు శాశ్వతంగా ఉంటాయన్నారు. 2017 నుంచి 2024 వరకు ప్రిన్సిపాల్ సంజీవ్, జూనియర్ లెక్చరర్ జె ఇందూర విద్యాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె వేణు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు



అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల, సెప్టెంబరు 4: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవ తీసుకుంటుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం పట్టణంలోని గడి ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి జువ్వాడి నర్సింగరావు ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల అవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తూ విద్యార్థులకు అన్నిసౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా నడిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో ముందుకు వెలుతున్నాడన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నరేశం, కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం నాయకులు పుప్పాల ప్రభాకర్, తిరుమల గంగాధర్, సంగ లింగం, కాశిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షానికి పాక్షికంగా కూలిన ఇళ్లు

కొడిమ్యాల, సెప్టెంబరు 4: నాలుగు రోజులుగా కురిసిన వర్షానికి మండలంలోని నాచుపల్లి, చెప్యాల, నల్లగొండ, నమిలికొండ, శ్రీరాములపల్లి, తురుకకాశీనగర్‌లో 11 ఇళ్లు పాక్షికంగా కూలాయి. బాధితులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో కూలిన ఇళ్లను పరిశీలించనున్నట్లు తహసీల్దార్ రాజమణి తెలిపారు.

భీమారం: మండలంలోని కమ్మరిపేట గ్రామానికి చెందిన అడువాల గంగారాం, అడువాల అమ్మాయిలకు చెందిన ఇంటి గోడ భారీ వర్షాలకు కూలిపోయింది. ఈ సమయంలో గదిలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వ విప్ పరామర్శ

భీమారం, సెప్టెంబరు 4: మండలంలోని గోవిందారం గ్రామానికి చెందిన పలువురు కుటుంబసభ్యులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన కొండ మౌళి గుండెపోటుతో, అదే గ్రామానికి చెందిన పుల్లూరి దేవయ్య తండ్రి రాజం అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కోరుట్ల రూరల్: సిరిసిల్ల జిల్లా పంచాయితీరాజ్ సీనియర్ ఇంజనీర్ తోకల భూమేశ్వర్‌ను వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. భూమేశ్వర్ తండ్రి నర్సయ్య రెండు రోజల క్రితం మృతిచెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొంతం రాజం, నాయకులు ఏలేటి మహిపాల్, జనార్ధన్, కాశిరెడ్డి, రామ్మోహనరెడ్డి, అక్షయ్ ఉన్నారు.

తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి

బుగ్గారం, సెప్టెంబరు 4: యూ డైస్ ప్లస్‌కు సంబంధించిన డాటా కాప్చర్ ఫార్మాట్ (డీసీఎఫ్)ను తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని మండల విద్యాధికారి గంగాధర్ సూచించారు. బుధవారం బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీసీఎఫ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి డీసీఎఫ్‌లో వివరాలు ఎలా చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, సీఆర్పీ పురుషోత్తం, ఎంఐఎస్ రాజేష్, సీసీవో హరిత, ఐఈఆర్పీ సమత పాల్గొన్నారు.

బాధిత ఉపాధ్యాయులకు ప్రభుత్వం న్యాయం



సభ్యత్వ నమోదు చేస్తున్న పీఆర్‌టీయూటీఎస్ నాయకులు

వెల్గటూర్, సెప్టెంబరు 4: జీవో నంబర్ 317 బాధిత ఉపాధ్యాయులకు త్వరలోనే న్యాయం జరిగేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని పీఆర్‌టీయుటీస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాల్ల అమర్‌నాథ్ రెడ్డి, బోయినిపెల్లి ఆనంద్‌రావు తెలిపారు. బుధవారం వెల్గటూర్, ఎండపల్లి మండలాలలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 317 జీవోపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం త్వరలోనే తన నివేదికను సమర్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు నర్సింగం, ప్రధాన కార్యదర్శి రవి, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల పదోన్నతులపై న్యాయ విచారణ జరపాలి

బీసీ, ఓసీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్





హైదరాబాద్‌కు తరలుతున్న విద్యుత్ ఉద్యోగులు, కోరుట్లలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 4: విద్యుత్ సంస్థల్లో జరిగిన పదోన్నతులపై న్యాయవిచారణ జరపాలని బీసీ, ఓసీ ఎంప్లాయిస్ జేఏసీ సంఘ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ, ఓసీ ఎంప్లాయిస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం జగిత్యాల నుంచి విద్యుత్ సౌధ ఎదుట నిర్వహిస్తున్న మహాధర్నాకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ, ఓసీ ఉద్యోగులకు న్యాయం చేయాలని యాజమాన్యాలను, ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ఆశించిన ఫలితం దక్కకపోవడంతో నిరసనగా భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ఈ మహాధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. విద్యుత్ సంస్థల్లో కండిషన్ల పేరుపై కల్పిస్తున్న పదోన్నతులపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని, విద్యుత్ సంస్థల్లో జూనియర్ లైన్‌మెన్ స్థాయినుంచి చీఫ్ ఇంజనీయర్ స్థాయి వరకు అన్ని కేడర్‌లలో సీనియారిటీ వెంటనే ప్రకటించి, ఉద్యోగులకు తెలియజేయాలని, విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులకు ఏపీఎస్ ఇబి రూల్స్ వర్తింపజేసి విద్యార్హతల ఆధారంగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చని పక్షంలో బీసీ, ఓసీ ఉద్యోగులు సమ్మె చేయడానికి వెనుకాడబోమని ఈ మహాసభ ద్వారా ప్రభుత్వానికి ముక్తకఠంతో విన్నవించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు అశోక్‌రెడ్డి, రహీమ్, శ్రీధర్, ప్రమోద్, ప్రసాద్, వరుణ్, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, గంగన్న, రాజమల్లు, మధు, గంగారెడ్డి, శ్రీహర్ష, శేఖర్, శ్రీనాథ్, జగదీష్, అబీద్, అజీజ్ తదితరులున్నారు.

● నల్ల బ్యాడ్జీలతో నిరసన

కోరుట్ల: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు పిలుపు మేరకు పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో బుధవారం నిరసన తెలిపారు. రూల్ అఫ్ రిజర్వేషన్ కోసం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్ర మంలో ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోల సంక్షేమ సం ఘ నాయకులు తెడ్డు గంగారాం, బండ రాజవీరు, వెన్నమల్ల శ్రీనివాస్, కొమ్ము సంపత్, కొమ్ము రాజేష్, పూర్ణచందర్, రాజేంద్రప్రసాద్, కిరణ్, తిరుపతి, లక్ష్మణ్, సాగర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ

సారంగాపూర్, సెప్టెంబరు 4: మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు తునికి జగదీష్ అన్న తునికి జగన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బుధవారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించారు. అలాగే పెంబట్ల, కోనాపూర్ సహకార సంఘం సీఈవో రాజ్‌కుమార్ మృతి చెందడంతో కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట నాయకులు రాంచందర్‌రెడ్డి, ఆకుల రాజిరెడ్డి, తోడేటి శేఖర్‌గౌడ్, వాసం శ్రీనివాస్, హరీష్, తదితరులు ఉన్నారు.

జారుడు బల్ల బహూకరణ

ధర్మపురి, సెప్టెంబరు 4: ధర్మపురి పట్టణంలోని న్యూ హరిజనవాడ అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులు ఆడుకోవటానికి పెండ్యాల బాలకృష్ణ-రాజేశ్వరీ దంపతులు జారుడు బల్లను బుధవారం బహూకరించారు. వారి మనుమడు అభయ్‌రామ్ పుట్టిన రోజు సందర్భంగా పిల్లలు ఆడుకోవటానికి స్లైడ్‌ను బహూకరించినట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ మాధవీలత దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏవోకు సన్మానం

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 4: మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన దీపికను మెట్‌పల్లి 23వ వార్డు కౌన్సిలర్ ఒజ్జెల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. బుధవారం మెట్‌పల్లి వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతు రుణమాఫీ పథకంలో భాగంగా కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవోతో పాటు ఏఈవోను రైతులు, నాయకులతో కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ షరతులు లేకుండా అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్‌కార్డులు అధికారులకు చూపుతున్న, కుటుంబ సభ్యులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను వెంటనే తీసుకరా వాలని ఇబ్బందులు గురిచేయకుండా రుణమాఫీకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్‌కు గురు బ్రహ్మ అవార్డు

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం) సెప్టెంబరు 4: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకోని మెట్‌పల్లి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ కె వెంకయ్యకు జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ నిర్వాహకులు బుధవారం గురు బ్రహ్మ 2024 అవార్డును ప్రకటించారు. వెంకయ్య 34 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తు ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పినందుకు గాను అవార్డును ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. వెంకయ్యను కాలేజీ అధ్యాపక బృందం, పలువురు అభినందించారు. ఆదివారం హైదారాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డును అందుకోనున్నారు.

ఘనంగా ఎల్ రమణ జన్మదిన వేడుకలు

రాయికల్, సెప్టెంబరు 4: రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక అంగడి బజార్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ రుక్కు, మరిపెల్లి నారాయణ గౌడ్, డాక్టర్ రఘునాథ్, కొల్లూరి వేణు, ప్రతాప్ రెడ్డి, నీరటి శ్రీనివాస్, రొట్టె శ్రీను, రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

కొడిమ్యాల, సెప్టెంబరు 4: మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన నేరెళ్ల శ్రీకాంత్ అనే యువకుడు ఇంటికి తిరిగి రాకపోవటంతో యువకుడి తల్లి నేరెళ్ల లక్ష్మి బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు ఈ నెల 3న శ్రీకాంత్ కరీంనగర్‌లో ఒక ఇంటర్వ్యూకు హాజరు కావాలని చెప్పి ఇంటి నుంచి పోయినట్లు తెలిపాడు. ఇంటికి రాక పోవటంతో శ్రీకాంత్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువుల, స్నేహితుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో తన కుమారుడని వెతికి అప్పగించాలని కోరుతూ యువకుడి తల్లి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కథలాపూర్, సెప్టెంబరు 4: ప్రస్తుతం విజృంభిస్తున్న సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సమియోద్దీన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతీదినం రోగులు వచ్చే సంఖ్య, చికిత్సలు, రక్త పరీక్షలు, మందులు పంపిణీ చేయడం వంటి అంశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని కోరారు. డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రత గురించి వివరించాలన్నారు. అనంతరం సిరికొండలో కొనసాగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి చిన్నారుల తల్లులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు సింధూజ, సూపర్‌వైజర్ శ్రీధర్, జిల్లా ఎన్‌సీడీ కోఆర్డినేటర్ మురళి, సబ్ యూనిట్ అధికారి అలీబేగ్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ విజేతలకు బహుమతులు పంపిణీ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ధర్మపురి, సెప్టెంబరు 4: ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా మూడురోజుల పాటు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు ధర్మపురి ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ బాలె గంగాధర్ చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కాసర్ల నరసింహ మూర్తి, కాంప్లెక్స్ హెచ్ఎం కొలిచాల శ్రీనివాస్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్, బహుమతుల దాత చాడ బుచ్చన్న, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ కాడె కవిత, క్రీడా ఉపాధ్యాయులు అటుకుల స్వప్న, అప్సర్, వరలక్ష్మి, బొప్ప జ్యోతి, అతియ బేగం, డాక్టర్ గొల్లపల్లి గణేష్ తదితరులు ఉన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



శ్రీనివాస్



ఆసిఫ్ అలీ

పెగడపల్లి, సెప్టెంబరు 4 : పెగడపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుంకరి రవి తెలిపారు. ఎస్.శ్రీనివాస్, ఎ మనోజ్ కుమార్, షేక్ అసిఫ్‌అలీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించనున్నట్లు తెలిపారు.

కథలాపూర్: మండలంలోని ఊటీపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న మామిడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం రోజున జిల్లా అధికారులతో అవార్డు అందుకోనున్నారు. శ్రీనివాస్‌రెడ్డి ఎంపిక పట్ల పలువురు హర్షం వెలిబుచ్చారు.

పెద్ద వాగుపై వంతెన నిర్మాణానికి కృషి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు



పెద్దవాగును పరిశీలిస్తున్న జువ్వాడి నర్సింగరావు, నాయకులు

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 4: కల్లూర్ శివారులోని పెద్ద వాగుపై వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వ దృష్టికి తీసుకపోయి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం మండలంలోని కల్లూర్ గ్రామ శివారులోని పెద్దవాగుపై వంతెనకు పడ్డ బుంగను పరిశీలించి వివిధ గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా పైపులైన్ మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా జువ్వాడి నర్సింగరావు మాట్లాడారు. లోలెవల్ వంతెన వాగు ఉప్పొంగినప్పుడు మునిగి పోవడంతో రాకపోకలకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గమనించిన నర్సింగరావు పార్టీ శ్రేణుల తో కలిసి పరిశీలించారు. గత సంవత్సరం పడిని బుంగ మరోమారు భారీ నీటి ప్రవాహంతో మరోమారు పడిన బుంగను పరిశీలించారు. వాగుపై భారీ వంతెన నిర్మాణం జరిగే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రుల దృష్టికి తీసుకపోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడారు. తీవ్ర వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే మహిళా రైతులు, రైతులు, రైతు కూలీలు జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ అంజిరెడ్డి, నాయకులు కాశిరెడ్డి, సత్యనారాయణ గౌడ్, రమేష, తిరుమల గంగాధర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

● మల్లాపూర్: గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున అటు వైపు ప్రజలు ఎవరు కూడా వెళ్లవద్దని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సూచించారు. బుధవారం మండలంలోని మొగిలిపేట గ్రామ శివారులోని గోదావరి నది పరివాహక ప్రాంతాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. నదికి వచ్చే రోడ్డు చెడిపోయిందని నర్సింగరావు దృష్టికి పలువురు దృష్టికి తీసుకరాగా త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానన్నారు. గోదావరిలోని వరద పరిస్థితి, మండలంలోని లో లెవల్ కల్వర్టులు, చెరువులు, శిథిలమైన భవనాలు, వరద ఉధృతికి పాడైన రోడ్ల గురించి అధికారులు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురవడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ వరద వస్తున్న నేపథ్యంలో నీటిని అధికారులు దిగువకు వదులుతున్నందున గోదావరి పరివాహక ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నది వద్దకు గ్రామస్థులు, రైతులు, గొర్రెల కాపర్లు, మత్స్యకారులు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నది ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అధికారులు పరిశీ లిస్తుండాలని, నది వైపు ప్రజలు వెళ్లకుండా చూడాలని అధికారుల కు సూచించారు. పార్టీ నాయకులు సురేష్, రమేష్, జలపతిరెడ్డి, చిన్నయ్య, బుచ్చిరెడ్డి, రాజేశం, బాపురెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కోరుట్ల: పట్టణంలోని అతి పురతన దేవాలయమైన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు బుధవారం సందర్శించారు. దేవాలయ అవరణలో అభివృద్ధి పనులను జువ్వాడి నర్సింగరావు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింగరావుతో పాటు స్థానిక నాయకులకు శేష వస్త్రాలను అందించి అశ్వీర్వదించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం నాయకులు పుప్పాల ప్రబాకర్, సంగ లింగం, కరణాకర్ రావు, తిరుమల గంగాధర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): మెట్‌పల్లి పట్టణంలో మెట్‌పల్లి లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం పట్టణంలో లయన్స్ క్లబ్ సభ్యులు వెల్మల శ్రీనివాస్‌రావు పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఇల్లెందుల శ్రీనివాస్, సెక్రటరీ గూండా రాకేష్, వేణుగోపాల్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 4: వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయం సన్నిధిలో అన్నదాన సత్రం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయంలోని శివార్చన మండపం వద్ద సత్రం నిర్మాణానికి స్థలాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఈవో వినోద్‌రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటనతో స్థల పరిశీలన చేశామన్నారు. భక్తులకు నిత్యం అన్నదానం అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రోజు 15 వేల మంది భోజనం చేసేలా భవనాన్ని నిర్మించేలా ప్రతిపాదనలు రూపొందించాలని, వచ్చే శనివారంలోగా అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.